క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గొటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



డా.జీ.సంజీవరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న శివ తదితరులు

మహేశ్వరం: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా.జీ.సంజీవరెడ్డి జన్మదినం సందర్భంగా మహేశ్వరం మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నడికూడ శివ, మండల నాయకులు ఆదివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలపై సంజీవరెడ్డి నిరంతరం పోరాడుతున్నారన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండి కార్మికుల పక్షాన నిలబడి ఉద్యమించాలని కోరారు. అంతకుముందు సంజీవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐఎన్‌టీయూ నాయకులు రోహిత్, కార్తీక్, శ్రీధర్, గణేష్, యాదయ్య పలువురు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కందుకూరు: తమతో పాటు చదువుకున్నస్నేహితురాలి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు తోటి మిత్రులు. కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాల 2004–05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని సువర్ణ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమెతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.58వేల నగదు జమచేశారు. ఆదివారం వారందరూ కలిసి రావిర్యాల గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించి, నగదు అందించి తాము అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఉపసర్పంచ్ రేవంత్‌రెడ్డి

కందుకూరు: పోటీల్లో పాల్గొనే యువత గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని అగర్‌మియాగూడ మాజీ ఉప సర్పంచ్ వడ్డేపల్లి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అగర్‌మియాగూడలో ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్–8 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడవడానికి క్రీడలో ఎంతో దోహదపడతాయన్నారు. చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు లిక్కి జంగారెడ్డి, గోసుల కొండల్‌రెడ్డి, అందె ప్రవీణ్‌యాదవ్, షేక్ మున్నా, చింతకింద రవీందర్‌ముదిరాజ్, లిక్కి ప్రశాంత్, ధన్నారం అంజిరెడ్డి, నేరటి మహేందర్ పాల్గొన్నారు.

గతాన్ని నెమరేసుకొని.. ఆహ్లాదం పంచుకొని

అబ్దుల్లాపూర్‌మెట్: ఆప్యాయ పలకరింపులు.. ఆత్మీయ కరచాలనాలు.. భావోద్వేగ సన్నివేశాలు.. వెరిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికయింది. మండలంలోని తారామతిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006–07 పదో తరగతి విద్యార్థులు ఒకచోటుకి చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరేసుకొని, ఒకరినొకరి నేపథ్యాన్ని వివరించుకున్నారు. అనంతరం అలనాటి గురువులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, బీరప్ప, జగన్నాథ్ పూర్వవిద్యార్థులు కర్రె సుదర్శన్, గ్యార బాలలింగస్వామి, మమత, ప్రశాంతి, జ్యోతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల గోస పట్టదా!

- పశువుల తరలింపులో నిర్లక్ష్యం
- చిన్నపాటి వాహనాల్లో కుక్కి రవాణా
- కానరాని ప్రత్యేక వాహనాలు
- పట్టించుకోని అధికారులు



సర్దార్‌నగర్ పశువుల సంతలో టాటాఏసీలకు పశువులను కట్టేసిన వ్యాపారులు



సర్దార్‌నగర్ పశువుల సంతలో పశువులను డీసీఎంలోకి ఎక్కిస్తున్న వ్యాపారులు

షాబాద్: పశువుల రవాణా కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలు ఎక్కడా కనిపించడం లేదు. నోరులేని మూగ జీవాలను చిన్నపాటి వాహనాల్లో ఒక దానిపై మరొకటి కుక్కి వందలాది కిలో మీటర్ల దూరం తరలిస్తున్నారు. దీంతో ఊపిరాడక మార్గ మధ్యలోనే మృత్యువాతపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మూగజీవాల రోధన పట్టించుకునే వారే కరువయ్యారు. వారాంతపు సంతల్లో అమ్మడానికి, వాటిని కోయడానికి తీసుకెళ్లేటప్పుడు ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. ఇరుకుగా ఉన్న వాహనాల్లో అధిక మొత్తంలో తరలిస్తూ మృత్యువాతపడేలా చేస్తున్నారు.

కనీస వసతులు కరువు

- పశువులను ఒక దగ్గర నుంచి మరో చోటకు తరలించాలంటే ఎనిమల్స్ చట్ట ప్రకారం వాటి కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన వాహనాల్లోనే తరలించాలి. కానీ ఇవేం పట్టించుకోకుండా రవాణాతో వాటికి ప్రాణం ఉండగానే నరకం చూపుతున్నారు.
- స్థానిక సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతోనే పశువుల క్రయవిక్రయాలు జరగాలి. కానీ ఎక్కడ వీటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. జీవాల తరలింపులో ప్రత్యేకమైన పరిమితులు ఉన్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.
- షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, మాల్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో సంతలు జోరుగా సాగుతున్నాయి.
- ఇక్కడ స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీలు పర్యవేక్షించాలి. వీటి ద్వారా వేలం పాటలో ఆదాయం పొందటమే కానీ కనీస మౌలిక వసతులపై దృష్టి పెట్టడంలేదన్న విమర్శలు ఉన్నాయి.
- అదేవిధంగా మూగజీలాల అక్రమ రవాణా నియంత్రణకు ప్రతీ మూడు నెలలకోసారి వెటర్నరీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మూగజీవాలను ఎవరైనా అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేయాలి.

నిబంధనలు..

- మూగజీవాలను తరలించే వాహనాలు రవాణాశాఖ నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాలి.
- గొర్రెలు, మేకలు 0.3 స్క్వేర్ మీటర్‌లో పెద్ద జంతువులకు 2 మీటర్ల మేర స్థలం ఉండేలా వాహనాలను ప్రత్యేకంగా తయారు చేయించుకోవాలి.
- ఆరోగ్యం బాగాలేని వాటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు వీలు లేదు. తరలింపులో వాటి వయస్సుతో పాటు బరువును సైతం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.
- పశువైద్యాధికారి అనుమతులు ఉంటేనే రవాణా, మాంసం విక్రయాలు జరిపించాలి. క్రయవిక్రయాల సమయంలో పశువులకు నీడ, నీటిని అందుబాటులో ఉంచాలి.
- నడిచేందుకు ప్రత్యేకంగా తయారు చేయించిన ర్యాంపులు ఉండాలి. ఈ బాధ్యత పూర్తిగా నిర్వాహకులపై ఉంటోందని సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో మూగజీవాలు	
ఆవులు	84,416
గేదెలు	1,89,606
గొర్రెలు	6,37,416
మేకలు	10,64,208

నిబంధనలు తప్పనిసరి



మూగజీవాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. జిల్లాలో ఎనిమల్ వెల్ఫేర్ రవాణా అధికారులు లేరు. అక్రమ రవాణాపై రవాణాశాఖ అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

– డాక్టర్ స్రవంతి, పశుసంవర్ధకశాఖ అధికారి

కుటుంబ సర్వేకు మరో అవకాశం

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొననివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. ప్రభుత్వం ఇటీవల నెలరోజుల పాటు ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిందని, ఈ సర్వేలో పాల్గొననివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. గతంలో సర్వేలో వివరాలు ఇవ్వని వారు ఈ నెల 28తేదీవరకు తమ కుటుంబ వివరాలను పట్టణంలోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయవచ్చని లేదా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్ రూరల్: ఇంటింటి సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఎంపీడీఓ సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సర్వే చేసిన సమయంలో వివరాలు అందించని వారికి మరో అవకాశం ఇచ్చిందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఉండే టోల్‌ఫ్రీ నెంబర్ 040–211111 నంబర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. లేదా ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు అందించాలని, ఈ నెల 28 వరకు అవకాశం ఉందని తెలిపారు.

ప్రజాపాలన సేవా కేంద్రంలో..

మొయినాబాద్: గతంలో సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కాజా మొయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల నమోదుకు ఫిబ్రవరి 28 వరకు ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవచ్చని లేదా ప్రభుత్వం అందిస్తున్న టోల్ ఫ్రీ నంబరులో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా శివాలయ బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటిరోజు ఆలయంలో గణపతిపూజ, హోమాలు, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు రోజంతా జరిగాయి. ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ చైర్మన్ సున్నపు వసంతం, ధర్మకర్త మాణిక్య ప్రభు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి రాత్రివరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులకు అలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయంలో భజన మండలితో భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. హోమంలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో కూడా ఆలయం వద్ద ఈ ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మాఘమాసం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయకగంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు అగ్గనూరు బస్వం, యుగేందర్, నందకిషోర్, అభిలాశ్, అమరలింగేశ్వర్, ప్రవీణ్, ప్రకాశ్, ఆగీరు కృష్ణయ్య, గజవాడ నర్సింలు, శ్రీధర్, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ఆలయ ట్రస్టు సభ్యులు మహావీర్, శంకర్‌లాల్ లాహోటీ, భరత్, అర్చకుడు రాజన్‌పండిత్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, భక్తులు

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం

పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా అందరం కలిసి సమష్టిగా పనిచేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్న మంగళారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కేతిరెడ్డిపల్లి గ్రామంలోని వెంకట్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మొయినాబాద్ మండలంలో బీఆర్‌ఎస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటేశ్, బుర్ర శంకరయ్య, తలారి రాజు, అవినాశ్, కుమ్మరి జనార్దన్, వడ్ల రమేశ్, దాహుద్, కృష్ణ, బాల్‌రాజ్, జాంగిర్, చాంద్‌పాషా, విజయ్, శేఖర్, సత్తయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏ ఆపద వచ్చిన అండగా నిలుస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లికి చెందిన కీలుకత్తి నర్సింహాగౌడ్ కొద్ది రోజులు క్రితం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం దశదిన కర్మను పురస్కరించుకొని నర్సింహాగౌడ్ ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే రంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నర్సింహాగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు దాసు, అశోక్‌గౌడ్, శంకర్, అమృతసాగర్, రవీందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీ ఫిలింసిటీలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు పోజిషన్ చూపించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.బుగ్గరాములు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి, పోల్కంపల్లి, ముకునూర్, రాయపోల్ గ్రామాల ప్రజలకు రామోజీ ఫిలింసిటీలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో పట్టాలు పంపిణీ చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వ అండతో ఫిలింసిటీ యాజమాన్యం లబ్ధిదారులను కబ్జాలోకి రాకుండా అడ్డుకుందన్నారు. లబ్ధిదారులకు స్థలాలు ఇప్పించి, అక్కడే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసే విధంగా పోరాటం చేస్తామన్నారు. లబ్ధిదారులు, సీపీఎం పార్టీ సానుభూతి పరులు అత్యధిక సంఖ్యలో కలెక్టరేట్ ధర్నాకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

బీటీరోడ్డు పేరుతో కాలయాపన

కాంగ్రెస్ నాయకులు మద్ది కరుణాకర్‌రెడ్డి, అమనగంటి ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

మహేశ్వరం: గత అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే ఎమ్మెల్యే సబితారెడ్డి తుమ్మలూరు–మహేశ్వరం బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు జరగకుండా కాలయాపన చేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్ది కరుణాకర్‌రెడ్డి, అమనగంటి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుమ్మలూరు–మహేశ్వరం వరకు బీటీరోడ్డు నిర్మాణం ఆలస్యం కావడానికి ప్రధాన కారణం అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి అని ఆరోపించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి లబ్ధి పొందేందుకే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించి పనులు జరగకుండా కాలయాపన చేసిందన్నారు. రోడ్డు నిర్మాణానికి సంవత్సరం సమయం ఉన్నా సబితారెడ్డి పనులు ప్రారంభించకుండా కాలయాపన చేసిందన్నారు. నిధులు లేవని తెలిసి మంజూరు అర్డర్ ఇచ్చి పనులు చేయాలని రోడ్డు కాంట్రాక్టర్‌ను ఒత్తిడి చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి తుమ్మలూరు గ్రామాన్ని, మహేశ్వరం మండలాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ వద్ద ఈ సమస్యలను తీసుకెళ్తే కొన్ని నిధులను మంజూరు చేయించడంతో కొంత పనులు జరిగాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గ్రామానికి చెందిన కొంత మంది యువకులను రెచ్చగొట్టి పనులు ప్రారంభించాలని ధర్నాలు చేయిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్‌ఎస్ నాయకులు కృత్రిమ ధర్నాలు చేయిస్తున్నారన్నారు. నాగారం–పెద్ద గోల్కొండ ఔటర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ నిధులు మంజూరు చేయించారన్నారు. హర్షగూడ రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేసిన ఘనత కేఎల్లార్‌కే దక్కుతుందన్నారు. తుమ్మలూరు– మహేశ్వరం బీటీరోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తారని తెలిసి ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు గ్రామ యువకులను రెచ్చగొట్టి కృత్రిమ ధర్నాలు చేయిస్తున్నారన్నారు. ప్రజలందరూ సబితారెడ్డి, బీఆర్‌ఎస్ నేతల తీరును గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట నర్సిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, మద్ది శ్రీధర్‌రెడ్డి, రంగారెడ్డి, కొండల్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విజయం సాధిస్తాం



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మీర్‌పేట: క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే జీవితంలో విజయం సాధిస్తారని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట నాగార్జున మాంటిసోరి ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ 12వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, భావ వ్యక్తీకరణ పెంపొందించేందుకు తమ విద్యాసంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలతో తల్లిదండ్రులు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. గత సంవత్సరం 10వ తరగతిలో పది పాయింట్లు సాధించిన 12 మంది విద్యార్థులకు రూ.10వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన క్షీరసాగర మధనం, రామాయణం, బాహుబలి, చంద్రముఖి వంటి పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ రజిని, సీఏఓ ఏ.శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, ప్రిన్సిపాల్ డి.మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల 1999–2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో వారందరూ పాల్గొని అలనాటి మధురస్మృతులు, చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. ఎవరెవరూ ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో ఒకరినొకరూ అడిగి తెలుసుకొని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు సుందరవరదాచార్యులు, అంజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవింద్ సిలాల్, సాయిబాబా, సరోజినీదేవి, నర్సమ్మ, ప్రభావతి తదితరులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న దేవాలయ వార్షికోత్సవం



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

నందిగామ: మండల పరిధిలోని బండోనిగూడలో మల్లన్న దేవాలయ నాలుగో వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు వివిధ వేషధారణల్లో ఆటాపాటలతో మల్లన్న కథను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవానికి వచ్చిన అతిథులను ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. అంతకుముందు గ్రామంలో మల్లన్న బోనాలను ఊరేగించారు. ఊరేగింపులో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, ఒగ్గుకళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, నాయకులు బుచ్చయ్య, కావలి కృష్ణయ్య, పాండు, పురుషోత్తంరెడ్డి, శేఖర్, సీతారాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని మధురాపూర్ గ్రామ పంచాయతీ మంగలిగడ్డ తండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బొమ్ము రంగయ్యగౌడ్ ఈ విరాళానికి సంబంధించిన నగదును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నక్కల శ్రీశైలం గౌడ్, ఆంజనేయులు, యాదయ్య, శ్రీనివాస్, శివకుమార్, లోక్యా నాయక్, గోపాల్ నాయక్, జైహింద్ నాయక్, రాములు నాయక్, గోపాల్ నాయక్, అంబుదాస్, పాండు నాయక్, వెంకటేశ్ నాయక్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.